




# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 95
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
డిసెంబర్ 31, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



8లో..

## ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం

- రూ. 5.98 కోట్లతో కృష్ణ కాలనీ కళాశాలకు నూతన బిల్డింగ్
- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్
- మంత్రి కొండా సురేఖ చొరవతో సాకారం కానున్న విద్యార్థుల కల


8లో..

## ఆపరేషన్ స్మైల్-11 విజయవంతం చేద్దాం

- జనవరి 1నుంచి 31 వరకు కార్యక్రమాలు
- అడిషనల్ డీసీపీ ఎం.రవి


2లో..

## పంట మార్పిడికి ప్రాధాన్యం ఇవ్వాలి


- 2,88,486 ఎకరాల్లో పంట విస్తీర్ణం
- కలెక్టర్ డాక్టర్ సత్య శారద


2లో..

## పార్కుల్లో పునరుద్ధరణ పనులు

- బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే
- హార్టికల్చర్ అధికారులతో సమీక్ష సమావేశం

# ధూపం, దీపం, నైవేద్యం.. స్వాహా !



- దుర్గంపేట 'అంజన్న' గుడిలో అక్రమాలు
- పూజలే తెలియని వ్యక్తి అర్చకుడిగా చలామణి
- ఎండోమెంట్ సొమ్ము ఆయన జేబులోకే
- సదరు వ్యక్తిని తొలగించాలంటున్న గ్రామస్తులు
- మంత్రి కొండా సురేఖకు వినతి

అంగబలం..అధికార బలం ఉంటే ప్రజలనే కాదు దేవుడికి కూడా శఠగోపం పెట్టవచ్చని నిరూపించాడు హనుమకొండ జిల్లా దామెర మండల పరిధిలోని దుర్గంపేట గ్రామానికి చెందిన ఒక ఘనుడు. ఆలయాల పరిరక్షణకోసం ప్రభుత్వం ధూపదీప నైవేద్యాల పేరిట ప్రతినెల ఇచ్చే సొమ్మును కాజేయాలన్న తలంపుతో అసలు అర్చకత్వమే తెలియకపోయినా గత కొన్ని సంవత్సరాలుగా సీతారామంజనేయ స్వామి ప్రధానార్చకుడిగా చలామణి అవుతూ దేవాదాయ శాఖతోపాటు, ప్రజలకు టోకరా ఇచ్చారు. దీంతో అసలు అర్చకుడే కాని సదరు వ్యక్తి కబంధ హస్తాలనుంచి సీతారామాంజనేయ స్వామికి విముక్తి కలిగించేందుకు స్థానికులంతా ఒక్కటయ్యారు. ఇంతకాలం ధూపదీప నైవేద్యాల పేరిట ప్రభుత్వం విడుదల చేసిన మొత్తాన్ని సదరు వ్యక్తి నుంచి కక్కించేందుకు సిద్ధపడుతున్నారు. ఈ మేరకు దేవాదాయ శాఖ అధికారులకు పలు మార్లు విజ్ఞప్తి చేయడంతోపాటు ఇటీవల మంత్రి కొండా సురేఖకు కూడా వినతి పత్రం అందజేశారు. సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో అర్చకత్వం తెలిసన వ్యక్తినే పూజారిగా నియమించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. – వరంగల్ వాయిస్, దామెర

వివరాలు2లో..

# ధూపం, దీపం, నైవేద్యం.. స్వాహా..!



- దుర్గంపేట 'అంజన్న' గుడిలో అక్రమాలు
- పూజలే తెలియని వ్యక్తి అర్చకుడిగా చలామణి
- ఎండోమెంట్ సొమ్ము ఆయన జేబులోకే
- గ్రామసభ తీర్మానం లేకుండానే తతంగం
- సదరు వ్యక్తిని తొలగించాలంటున్న గ్రామస్తులు
- మంత్రి కొండా సురేఖకు వినతి

**వరంగల్ వాయిస్, దామెర :** మనుమకొండ జిల్లా దామెర మండల పరిధిలోని దుర్గంపేట గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయానికి ప్రధాన అర్చకుడిగా చలామణి అవుతున్న ముదురుకోల విజయ్ కుమార్ ను వెంటనే తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అసలు అర్చకత్వమే తెలియని సదరు వ్యక్తి ప్రజలను, దేవాదాయ శాఖ అధికారులను గత కొన్ని సంవత్సరాలుగా మోసగిస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. ఈ మేరకు గ్రామ ప్రజలంతా ఒక్కటై విజయ్ కుమార్ పై తిరుగుబాటు బాహుటా ఎగురవేశారు. ఆయనను తొలగించేవరకు ఉపక్రమించేది లేదంటూ వాగ్దానం చేశారు.

### దొడ్డిదారిన..

గ్రామ పరిధిలోని ఆలయంలో అర్చకుడిగా విధులు నిర్వర్తించాలంటూ తొలుత గ్రామ సభ ఆమోదించాలి. కాని ముదురుకోల విజయ్ కుమార్ గ్రామ సభ తీర్మానం లేకుండానే ప్రధాన అర్చకుడిగా అవతారం ఎత్తారు. కొందరు నాయకుల ప్రోద్బలంతో గ్రామస్తులకు తెలియకుండానే దొడ్డిదారిన ఎండోమెంట్ అధికారులను ఆశ్రయించి సీతారామాంజనేయ స్వామి టెంపుల్ ప్రధాన అర్చకుడిగా రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సదరు వ్యక్తికి అసలు అర్చకత్వమే తెలియదని ఊరి ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించేందుకే సదరు వ్యక్తి ఈ తరహా మోసానికి తెరతీశారని పేర్కొంటున్నారు.



ఈ విషయమై దుర్గంపేట గ్రామానికి చెందిన సుమారు 60 మంది గ్రామస్తులు ఉన్నతాధికారులకు కంప్లయింట్ చేశారు. ధార్మిక భవన్‌కు సైతం వెళ్లి ఆఫీసర్లకు వివరించారు. ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఆలయాలకు అందించే ధీపదూప నైవేద్యం సొమ్ము ప్రైవేటు వ్యక్తి జేబులోకి వెళ్లడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు ఈ విషయమై లోతుగా ఎంక్వయిరీ చేసి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆలయ సొమ్ము అనర్హుడికి అందజేయడం దేవుడు సైతం క్షమించబోడని, అధికారులు ఈ సంగతి గుర్తించి సదరు వ్యక్తిని తొలగించి అర్హుడైన పురోహితుడిని ప్రధాన అర్చకుడిగా నియమించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత శాఖ మంత్రి, జిల్లా మినిస్టర్ అయిన కొండా సురేఖ దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అదే విధంగా ఇంతకాలం దేవాదాయ శాఖను మోసం చేసిన సదరు వ్యక్తి నుంచి ధూపదీప నైవేద్యాల పేరిట చెల్లించిన సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సొమ్ము సుమారు రూ.3లక్షల పైనే ఉంటుందని అభిప్రాయ పడుతున్నారు.

### అర్చకత్వం తెలిసిన వ్యక్తికే..

దుర్గంపేట గ్రామ పంచాయతీ ఆవరణలో ఇటీవల స్తానికులు గ్రామ సభ నిర్వహించారు. హనుమాన్ గుడి అర్చకుడిగా చెలామని అవుతున్న ముదురుకోల విజయ్ కుమార్ ను వెంటనే తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మాణించారు. గత 25 సంవత్సరాలుగా పురోహితం నిర్వహిస్తున్న తూపురాణి శ్రీనివాస చార్యులును హనుమాన్ గుడి అర్చకుడిగా నియమించాలని నిర్ణయించారు. గ్రామ ప్రజల కోరిక మేరకు గ్రామ సభలో తీర్మాణాన్ని ఆమోదించారు. గ్రామస్తులు సంతకాలతో కూడిన సదరు తీర్మాణాన్ని గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ కు అందించారు.

# పార్కుల్లో పునరుద్ధరణ పనులు

- బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే
- హార్టికల్చర్ అధికారులతో సమీక్ష సమావేశం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని పార్కుల్లో పునరుద్ధరణ పనులు చేపట్టాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో హార్టికల్చర్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్ధవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర వ్యాప్తంగా 27 పార్కు ల్లో దెబ్బతిన్న వివిధ అభివృద్ధి పనులను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ఉద్యానవన, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు సిబ్బంది సమన్వయంతో వేగవంతంగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. పార్కులలో దెబ్బతిన్న ఓపెన్ జిమ్ పరికరాలు, పిల్లలు ఆడుకునే ఆట పరికరాలు గుర్తించి వాటికి వెంటనే మరమత్తులు చేయాలని, దెబ్బతిన్న లైటింగ్ ను తిరిగి ఏర్పాటు చేయాలని ఇందుకోసం అంచనాలు తయారు చేయాలన్నారు. పార్కుల్లో నీటి సరఫరా సమస్యలు ఉంటే ఇంజనీరింగ్ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, పార్క్ లలో గ్యాప్ ప్లాంటేషన్ చేపట్టాలని కొత్తగా నిర్మించిన పార్కుల్లో ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేసేలా చూస్తూ వాకర్స్ అసోసియేషన్స్ వారి సహకారంతో పార్కులు సమర్ధవంతంగా నిర్వహించేలా చూడాలన్నారు. వివిధ రకాల కారణాలతో పార్క్ లలో పడిపోయిన, దెబ్బతిన్న గోడలు తదితర సివిల్ పనులను గుర్తించి వాటి పునరుద్దరణకు అంచనాలు సిద్ధం చేయాలన్నారు. సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) కింద షాపింగ్ మాల్స్ ఇండస్ట్రీస్ వారి ఆర్థిక సహకారంతో పనులు పూర్తి చేసేలా చూడాలన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్ జీటీ) వారి ఆదేశం మేరకు కోట చెరువు ప్రాంతంలో గ్రీనరీ ఏర్పాటు చేయడానికి రెండు వరుసల్లో మొక్కలను నాటేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారులు రమేష్, లక్ష్మారెడ్డితో పాటు ఈఈ మహేందర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు ప్రిన్సి, అశ్విని, అనూహ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ధర్నా సిగ్గుచేటు

- కొండా దంపతులను విమర్శిస్తే సహించేది లేదు
- టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ బస్టాండ్ నిర్మాణంపై బీజేపీ ధర్నా చేయడం సిగ్గుచేటని టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ అన్నారు. మీసాల ప్రకాష్ నివాస గృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ కార్పొరేటర్ జరాతి రమేష్ తో కలిసి ఆయన మాట్లాడుతూ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బస్టాండ్ నిర్మాణంపై కొండా సురేఖ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. భవిష్యత్ తరాలకు సరిపడే విధంగా మోడల్ బస్టాండ్ డిజైన్ చేశారన్నారు. అదేవిధంగా బస్టాండ్ చుట్టూ ఉన్న చిరు వ్యాపారులకు జీవనోపాధి కల్పించే విధంగా బస్టాండ్ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ఒప్పించి వరంగల్ నగరాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లేందుకు మంత్రి కృషి చేస్తున్నారని మీసాల ప్రకాశ్ గుర్తు చేశారు. మామునూర్ అంతర్జాతీయ విమానాశ్రయం, రూ.4,800 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించి తీసుకురావడం జరిగిందన్నారు. వరంగల్ నగరం అభివృద్ధికి కొండా దంపతులు శాయశక్తుల కృషి చేస్తున్నారన్నారు. కొండా దంపతులపై పనికిమాలిన విమర్శలు చేస్తే బీజేపీ నాయకులకు తగిన బుద్ధి చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ భాషాపాక సదానందం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్, ఎర్రం కమల్, పోలేపాక విశాల్, బాబు, ఇనుగాల శరత్, పోలేపాక యాకూబ్, కొమ్ము అమర్, గూడ శారద, గుడ లావణ్య, సర్దార్ జస్వీర్ సింగ్, కొండమీద సదానందం, మంద యశ్వంత్ సేన, శాబాది యోగి, నర్సింగరావు, రణదీప్ తదితరులు పాల్గొన్నారు.



# పంట మార్పిడికి ప్రాధాన్యం ఇవ్వాలి

- 2,88,486 ఎకరాల్లో పంట విస్తీర్ణం
- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలోని వ్యవసాయ సాగు భూముల్లో ప్రతి ఏడు ఒకే రకమైన పంట కాకుండా పంట మార్పిడికి ప్రాధాన్యం ఇవ్వాలని సంబంధిత శాఖల అధికారులకు, రైతులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. ఆయా పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా స్థాయి ప్రణాళిక కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని హార్టికల్చర్, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, ఫిషరీస్, అగ్రికల్చర్ ఆయా సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం, మొక్కజొన్న, పప్పు ధాన్యాలు, మిరప, డ్రైఫ్రూట్స్, కూరగాయలు, పండ్ల తోటల పెంపకం, పచ్చి రొట్టా, పూల తోటలు తదితర పంటలు పెంచేందుకు 2,88,486 ఎకరాల్లో పంట విస్తీర్ణం కలదని పేర్కొన్నారు. వానకాలం సీజన్ 2024-25 సంవత్సరానికిగాను మండల స్థాయి కమిటీల ద్వారా సేకరించిన పంటల వివరాలను అనుసరించి జిల్లా స్థాయి కమిటీ నివేదికల ద్వారా వివరాలు సేకరించి పంట విస్తీర్ణ కమిటీ మీటింగ్ సమక్షంలో నివేదికలు సమర్పించి కమిటీ ఆమోదించనైనదని జిల్లా ప్రణాళిక శాఖ అధికారి గోవిందరాజన్ అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు ఉమారాణి, వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, ఉద్యానవన శాఖ అధికారి సంగీతలక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్తు రంగాన్ని కాపాడుకుందాం

## ➲ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** విద్యుత్ రంగ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కరీమాబాద్ సబ్ స్టేషన్ వద్ద సీఐటీయూ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముక్కెర రామస్వామి, మాలోత్ సాగర్ పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో మూడవసారి ఏర్పడిన మోడీ ప్రభుత్వం గతం కన్నా మరింత దూకుడుగా ప్రజా వ్యతిరేక, వినాశకర విధానాలను అవలంబిస్తున్నదన్నారు. విద్యుత్ రంగంపై బీజేపీ ప్రభుత్వం దాడి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మద్య కాలంలో చండీగఢ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో డిస్కంలను ప్రైవేట్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాష్ట్రాలలో దొడ్డిదారిన స్మార్ట్ మీటర్లు నెలకొల్పడం ద్వారా విద్యుత్ ప్రైవేట్ పరం చేసే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పవర్ గ్రీడ్ సబ్ స్టేషన్ లను గుంపగుత్తగా ఔట్ సోర్సింగ్ చేయమని ఆదేశించారు. స్మార్ట్ మీటర్లు అమలు సహా అన్ని కాంట్రాక్టులు ఆదానికే కట్టబెట్టారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ చేయడానికి మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యుత్ రంగ కార్మికులు వీరోచిత పోరాటం చేస్తున్నారు. నేడు చండీగఢ్, ఉత్తరప్రదేశ్ లలో పోరాటంలో కార్మికులు అగ్రభాగాన నిలుస్తున్నారు. ప్రవేటీకరిస్తే ప్రజలకు, కార్మికులకు చాలా నష్టాలు వాటిలే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి, మోడీ ప్రభుత్వ విధానాలను ప్రజలు ముక్త కంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎండీ మహబూబ్ పాషా, గణిపాక ఓదెలు, ఎండీ ఇస్మాయిల్, రతన్ గౌడ్, రాఘవరెడ్డి, జుబేదా జహేదా, మాదాసు దివ్య, యాకమ్మ, ఎండీ యాకు పాషా, మన్సూర్, యాకమ్మ, సూరయ్య, జహీదా, స్వరూప, పెంటయ్య, విమల, సబ్ స్టేషన్ కార్మికులు డి.కిష్టయ్య, రహమత్, భద్రయ్య, రాము, సాంబయ్య, నాగరాజు, షరీఫ్, రంజిత్ పాల్గొన్నారు.

# క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో “కాంగ్రెస్ పార్టీ” ఆధ్వర్యంలో పరకాల మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు సీఎస్ఐ ఏరియాలో మంగళవారం పరకాల కాంగ్రెస్ పార్టీ నాయకులు “మడికొండ బ్రదర్స్” నేతృత్వంలో ప్రత్యేకంగా రూపొందించిన 2025- నూతన సంవత్సరం క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పరకాల పట్టణ, మండలం, నియోజకవర్గం, వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ప్రజానీకానికి నూతన సంవత్సర-2025, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిఒక్కరూ సుఖ:సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని వేడుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల మాజీ ఎంపీపీ ఒంటేరు రాంమూర్తి, స్థానిక కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్, ఎన్ఎస్ యూఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అవార్డు గ్రహీత 2018, డాక్టర్. మడికొండ శ్రీను, పరకాల కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం శివ, బొచ్చు భాస్కర్, బొచ్చు రవి, బొచ్చు జితేందర్, కందుకూరి విద్యాసాగర్, మంద సురేష్, ఆర్ఎంపీ దుప్పటి బాబురావు, ఒంటెరు వరుణ్, బొచ్చు సంపత్, మద్దెల భద్రయ్య, ఒంటెరు సాగర్, మడికొండ ప్రవీణ్, మడికొండ నవీన్, మంద ఆనంద్, మరుపట్ల మహేష్, ఒంటెరు మొగిలి, ఎంఎస్ రవి, బ్యాంకు సుధాకర్, బొచ్చు విష్ణు, బొచ్చు కిషన్, మడికొండ రాజు, బొచ్చు నాగరాజు, చేరిపెల్లి సతీష్, ఒంటెరు కిషోర్, నాగెల్లి ముత్తయ్య, సంగి పున్నం, ఒంటెరు సమ్మయ్య, మహిళలు నాగెల్లి సరోజన, మడికొండ ఓదెమ్మ, ఒంటెరు రజిత, ఒంటెరు మరియమ్మ, చుక్క భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మోహన్ సింగ్**
**ఎంజీఎం(పీపీయూనిట్) పరిశీలన**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎంజీఎం హాస్పిటల్ ఆర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ (పీపీ యూనిట్)ను వర్ధన్నపేట డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్.మోహన్ సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్. మోహన్ సింగ్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి వైద్య సేవలు అందించడానికి కృషి చేయాలని డాక్టర్ కు, స్టాఫ్ ను కోరారు. ముఖ్యంగా ఆల్ నేషనల్ ప్రోగ్రామ్స్ 100శాతం టార్గెట్ రీచ్ కావాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జ్వరాల పట్ల ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. చలి తీవ్రత ఎక్కువగా ఉందని సాయంత్రం 7 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు పిల్లలు, వృద్ధులు ఈ సమయంలో బయట తిరుగడం మంచిది కాదని తెలిపారు. ఒకవేళ అత్యవసర పరిస్థితిలో బయటికి వెళ్లాల్సి వస్తే స్వెటర్ కానీ, ఉలన్ దుస్తులు ధరించి బయటికి వెళ్లాలని తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ నర్మద, ఏఎన్ఎం సులోచన, రామ రాజేష్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రీయ వ్యవసాయమే ప్రకృతికి రక్ష

## ▪ అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మీప్రసన్న



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని వివిధ గ్రామాల రైతులతో సేంద్రీయ వ్యవసాయం కేవలం ఒక వ్యవసాయ పద్ధతి మాత్రమే కాకుండా భూమి, పర్యావరణం, భవిష్యత్ తరాల ఆరోగ్యాన్ని కాపాడే మార్గమని అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మీప్రసన్న అన్నారు. సేంద్రీయ వ్యవసాయం సింథటిక్ రసాయనాలను ఉపయోగించకుండా, కంపోస్ట్, పచ్చివాటి ఎరువులు, జీవ హానికర నియంత్రణ వంటి సహజ శ్రేయోభిలాషాలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఇది ప్రకృతి అనుకూల పద్ధతులను అనుసరిస్తూ ప్రకృతితో సమన్వయంగా పనిచేస్తుందన్నారు. సేంద్రీయ వ్యవసాయ ప్రాధాన్యతను వివరించిన స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె. లక్ష్మీ ప్రసన్న రైతులకు దాని ప్రయోజనాలు, సేంద్రీయ వ్యవసాయానికి మారడం ఎలా అనేది వివరించారు. సేంద్రీయ వ్యవసాయం మట్టిని సేంద్రీయ పదార్థాలతో సంపన్నం చేస్తుందని, భూమి సారాన్ని, నిర్మాణాన్ని మెరుగుపరుస్తుందని తెలిపారు.ఈ విధంగా రైతులను ప్రయోజనపరచడంతో పాటు, కాలుష్యాన్ని తగ్గించవచ్చుని, భవిష్యత్లో భూమి సారాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ఎంచుకోవడం ద్వారా, పంటలు పెంచడమే కాదు, ఆరోగ్యకరమైన గ్రహాన్ని, బలమైన సంఘాలను, వ్యవసాయానికి మెరుగైన భవిష్యత్తును పెంపొందించవని తెలిపారు.

# హద్దు మీరితే ప్రమాదం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కొత్త సంవత్సరాలు జీవితంలో ఎన్నో వస్తూ ఉంటాయి.... కానీ ఒకసారి ప్రమాదం జరిగి ప్రాణం పోతే మిమ్మల్ని కన్నవారికి తీరని శోకం మిగిల్చిన వారవుతారని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ యువతను ఉద్దేశించి అన్నారు. కొత్త సంవత్సరం పార్టీల పేరుతో మద్యపానం సేవించి ద్విచక్ర వాహనాలపై విచ్చలవిడి వేగంతో హద్దు అదుపు లేకుండా ప్రవర్తిస్తే ప్రమాదాలు జరిగి శాశ్వత అంగవైకల్యం జరిగి మీ జీవితంలో తీరని నష్టం జరుగుతుందని హెచ్చరించారు. విలువైన ప్రాణంతో పాటు సర్వస్వం కోల్పోవాల్సి వస్తుందని ఆయన అన్నారు. సరదా అనేది హద్దు మీరుకుండా ఉంటే ముద్దు అని ఈ సంవత్సరం ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని ఆయన కోరారు. హద్దు మీరే వారిపై చర్యలు తీసుకోవడానికి పోలీసు యంత్రాంగం గట్టి నిఘా ఏర్పాటు చేసిందని, ఎట్టి పరిస్థితుల్లో పట్టుపడితే తప్పించుకునే అవకాశం లేదన్నారు.అనవసరంగా ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని ఆయన యువతకు సూచించారు.

# మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** డివిజన్ లో కొత్తగా వెలుస్తున్న కాలనీలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి తాను శాయశక్తులా కృషి చేస్తానని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. మంగళవారం ఉర్సు ఎల్లమ్మ తాళ్ల మండువ వద్ద నూతనంగా ఇండ్లు నిర్మించుకున్న వారు తమ ప్రాంతానికి ఎల్లమ్మ కాలనీ పేరు నామకరణ చేసిన బోర్డును కార్పొరేటర్ మరుపల్ల రవి ఆవిష్కరించారు. ఇప్పటికే మీ ప్రాంతంలో కరెంట్ స్తంభాలకు లైట్స్, మిషన్ భగీరథ పైపు లైన్, మొరం రోడ్డును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొద్ది రోజుల తర్వాత డ్రైనేజి, సీసీ రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. నల్లా కనెక్షన్ పొందు వారు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్నచో అధికారులు నల్ల మంజూరు చేస్తారని, ఇండ్లలోని చెత్తాచెదారం తీసుక వెళ్లేందుకు స్వచ్ఛ ఆటోను ఏర్పాటు చేస్తామని కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. 40వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పూజారి విజయ్, కాలనీ వాసులు బండారి అరవింద్, వడ్లకొండ బాబు, బండ యాదగిరి, గునుగంటి రామచంద్రం, బుదాటి వెంకటేశ్వర రావు, సట్ల స్వామి, ఓదెల రవీందర్, మొతుకూరి శేషగిరి రావు, భూక్యా యాక్య నాయక్, జవాన్లు కొమురెల్లి, ప్రశాంత్ ఉన్నారు.

# బాల్నే తిలక్ బాబు హఠాన్మరణం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలం నవ తెలంగాణ పాత్రికేయుడు బాల్నే తిలక్ బాబు(53) గత అర్ధరాత్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. కాగా, దివంగత తిలక్ బాబు పార్థివ దేహానికి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, పూర్వ అధ్యక్షుడు, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, తెలంగాణ ఆన్ లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, ఢీంబాయ్ టీవీ న్యూస్ ఛానల్ సీఈవో వేముల సదానందం నేత, మన తెలంగాణ స్పెషల్ కరస్పాండెంట్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జర్నలిస్ట్ హౌసింగ్, వెల్ఫేర్ రాష్ట్ర కన్వీనర్ వల్లాల వెంకటరమణ, వార్త దినపత్రిక వరంగల్ జిల్లా ప్రతినిధి చెరుకు వేణు ప్రసాద్, వన్ ఇండియా వరంగల్ జిల్లా ప్రతినిధి బండారి ప్రమోద్ కుమార్, శాయంపేట మండల మాజీ ఎంపీపీ, వేజ్ బోర్డు మెంబర్ బాసాని చంద్రప్రకాష్ తదితరులు పూలు సమర్పించి నివాళులు అర్పించారు. బాల్నే తిలక్ బాబు మృతి పట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం టీయూడబ్ల్యూజే (143) రాష్ట్ర నాయకుడు లెనిన్, నవతెలంగాణ స్టాఫ్ రిపోర్టర్ దయాసాగర్, సీనియర్ జర్నలిస్ట్ సోమ నరసయ్య, ఐజేయూ నాయకుడు మధు, గుంటి విద్యాసాగర్, తహసీల్దార్ సత్యనారాయణ, సీఐ రంజిత్ రావ్, ఎస్ఐలు పరమేశ్వర్ ,ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో కార్యాలయం ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు తిలక్ కు చివరిసారిగా నివాళులర్పించారు.

# మాట తప్పని ప్రభుత్వం మాది

## పంగిడిపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మాట తప్పని.. మడమ తిప్పని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని, ఏడాది కాలంలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల పక్షాన నిలుస్తున్న ప్రభుత్వం మాది అని కమలాపూర్ మండలం పంగిడిపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు అన్నారు. ప్రభుత్వం చేసిన రైతు రుణమాఫీతో 80శాతం రైతులకు లబ్ధి చేకూరిందని, రెండు రోజుల క్రితం కొంతమంది రైతులు చేసిన కార్యక్రమం ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించేలా ఉందన్నారు. వారు చేసిన ఆరోపణలో వాస్తవం లేదని, రెండు లక్షలకు పైన ఉన్న రైతులకు రుణమాఫీ ఇంకా కాలేదని, అందులో ఉన్న వారు వాళ్లేనని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి ఇంచార్జి ప్రణవ్ బాటలు వేస్తూ ప్రజల్లో ఎల్లవేళలా ఉంటున్నాడని కితాబిచ్చారు. ప్రతి పథకం ప్రజలకు అందేలా చూస్తామన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, ఇతర పార్టీల మాటలు నమ్మవద్దన్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి, రైతులు పాలాభిషేకం నిర్వహించారు. కాగా వీరి మీడియా సమావేశానికి వచ్చిన ఓ రైతు మన వద్ద ఎక్కడ 80 శాతం రైతు రుణమాఫీ అయిందో చూపాలని, చూపిస్తే ముక్కు నేలకు రాస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకులు తిప్పారపు యుగేందర్, ఓబిసి రాష్ట్ర కార్యదర్శి బాలపురి కనకరత్నం, సాంబయ్య, రాజు, చిన్న బాబు, శ్రీను, ఆదిరెడ్డి, నరసయ్య, లింగారావ్, లింగమూర్తి, రైతులు పాల్గొన్నారు.

# ప్రజల సుభిక్షమే ప్రభుత్వ సంకల్పం

## జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

## తెలిపిన నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** యావత్ తెలంగాణ సమాజం సుభిక్షంగా ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంకల్పమని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి  పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిందే తడవుగా అందుకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేసి విజయవంతం అయ్యిందని ఆయన కొనియాడారు. మరికొద్ది గంటల్లో నూతన సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా ఆయన హనుమకొండ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏమ్మెల్యే నాయిని మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు పరిచిన చరిత్ర ప్రజా ప్రభుత్వం దని ఆయన తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రజల ఆకాంక్షలకు తగిన ప్రణాళికలు రూపొందించి సుభిక్షమైన పాలనను అందించి కొత్త ఒరవడిని సృష్టించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు. అదే ఒరవడితో నూతన సంవత్సరంలోనూ సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో రంగరించి ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా నిర్ణయాలు ఉంటాయన్నారు. ప్రజలు నూతన సంవత్సరంలో తీసుకోబోయే నిర్ణయాలు వారి అభ్యున్నతికి దోహదపడాలని ఆకాంక్షించారు.

# మితిమీరిన డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

## సీఐ క్రాంతి కుమార్



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో అడుగడుగునా వెహికల్ చెకింగ్, డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందని పరకాల సీఐ క్రాంతి కుమార్ అన్నారు. కాబట్టి  పరకాల పట్టణ ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని, మోటార్ సైకిల్స్ పై రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తే కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని పరకాల సీఐ క్రాంతి కుమార్ హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మరియు రోడ్ల మీద నూతన సంవత్సర వేడుకలు జరుపడం లేదా డీజేలు, సౌండ్ సిస్టం పెట్టడం నిషేధం, రాత్రి వేళల్లో ఎలాంటి చిన్న గొడవలకు దిగిన కఠినంగా వ్యవహరించడం జరుగుతుందన్నారు. రాత్రి వేళలో రోడ్ల మీద, బహిరంగ ప్రదేశాల్లో గుమిగూడడం, మద్యం సేవించడం చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడుతాయన్నారు. ప్రజల రక్షణ కోసం ప్రతి జంక్షన్ లోనూ పోలీసు నిఘా, బందోబస్తు ఉంటుందన్నారు.

# క్రీడా రంగానికి హనుమకొండ కేంద్రంగా మారుస్తా

- మౌలిక వసతులు, అభివృద్ధికి కట్టుబడి ఉన్నా
- జేఎన్ఎస్ లో క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** క్రీడా రంగంలో హనుమకొండ అన్ని విధాలుగా సౌకర్యాలు ఉన్నాయని, క్రీడా కేంద్రంగా హనుమకొండ అభివృద్ధి చెందుతుందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో జరుగుతున్న అథ్లెటిక్స్ టోర్నమెంట్ ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. స్టేడియంలో జరుగుతున్న బాలిక, బాలుర 1500 మీటర్ల పరుగుల పందెం, లాంగ్ జంప్ క్రీడాలను జెండా ఊపి ప్రారంభించారు. క్రీడా రంఘం అభివృద్ధికి స్థానిక శాసనసభ్యుడిగా అన్ని సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. క్రీడల పోటీల్లో



ఉత్తమ ప్రతిభ చూపాలని జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు ప్రాఖ్యతలు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ చైర్మన్ జిల్లా అధ్యక్షుడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్ రావు, జిల్లా క్రీడాశాఖ అధికారి అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్, నాయిని లక్ష్మా రెడ్డి, స్థానిక నాయకులు, క్రీడా కారులు, కోచ్ తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా అయ్యప్ప రథయాత్ర



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్వామి శరణం అయ్యప్ప శరణం భగవాన్ శరణం భగవతి శరణం శరణు ఘోషతో శివనగర్ పురవీధుల్లో అయ్యప్ప నామస్మరణతో భజనలతో ప్రతిధ్వనించింది. సోమవారం శివనగర్ లో అయ్యప్ప రథయాత్ర కన్నుల పండుగ కొనసాగింది. ఎరుమేలి ధర్మశాస్త్ర అయ్యప్ప సేవా సమితి గురుస్వామి బత్తిని సతీష్ కుమార్ వారి తండ్రి బత్తిని సాంబయ్య గౌడ్ జ్ఞాపకార్థం అయ్యప్ప రథం నిర్మించి మొదటి సారి రథయాత్ర, నగర సంకీర్తన చేపట్టారు. 35వ డివిజన్ లోని సిద్ధిబుద్ధి విజయ గణపతి ఆలయం పూజారి శ్రీరామ్ శర్మ గురు స్వామి సారథ్యంలో సిద్ధిబుద్ధి దేవాలయం నుండి రథయాత్ర శివనగర్, 34, 35 డివిజన్లో కొనసాగింది. దారి పొడవునా స్వామివారికి మంగళ నీరాజనాలతో భక్తులు స్వాగతం పలికారు. అయ్యప్ప మాలధారులు, గురుస్వాములు, రథయాత్రను వైభవంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు రామారావు, కృష్ణారావు, మల్లయ్య, పూజారి భాస్కర్, దేవేందర్, శంకరప్పలతో పాటు గురుస్వాములు బైరి శ్యాంసుందర్, మధుగురు స్వామి, ఊరుగొండ సురేష్, బోడకుంట్ల కృష్ణ, తిమ్మాపూర్ శ్రీనివాస్, వక్కల రాజు, ఆడెపు రాజేంద్రప్రసాద్, బత్తుల సత్యం తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ ప్యూరిఫైర్ అందజేత



**వరంగల్ వాయిస్, నడికూడ :** పాఠశాలలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్, హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు దొంతుల శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ రీజనల్ చైర్మన్ మాదంశెట్టి సంపత్, క్రీ.శే మాదశెట్టి సదానందం జ్ఞాపకార్థం మాధంశెట్టి రాము రూ.17,000 పదిహేడు వేల రూపాయల వాటర్ ప్యూరిఫైర్, వాటర్ ట్యాంక్ ను అందజేసినట్లు ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు దొంతుల శ్రీ నివాస్ తెలిపారు. విద్యార్థులకు పరిశుభ్రమైన నీటిని అందజేయాలని, దాహార్తిని తీర్చేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని దొంతుల శ్రీనివాస్ తెలిపారు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ వీ101ఏ గవర్నర్ శ్రీ గంప సాంబమూర్తి మాట్లాడుతూ నడికూడ పాఠశాలకు కనీస వసతులు కల్పిస్తామని, పదవ తరగతిలో జీపీఏ 10కి 10వస్తే నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డిస్ట్రిక్ గవర్నర్ శ్రీ గంపా సాంబమూర్తి ముఖ్య అతిదులుగా, క్యాబినేట్ సెక్రటరి నూత కుమార్, ట్రెజరర్ పబ్బతి నాగభూషణం, రీజనల్ చైర్మన్ మాదంశెట్టి సంపత్, హనుమకొండ వాసవి క్లబ్ చైర్మన్ ఇటుకుళ్ల శ్రీనివాస్, లక్ష్మణ కాంత్, డిస్ట్రిక్ ఆఫీసర్ ఐత వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ బృందం మాదారపు సుమంత, శ్రవణ్ కుమార్, శారద, అశోక్ పాల్గొన్నారు.

# ప్రైవేట్ కు దీటుగా చర్లపల్లి పాఠశాల

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

**వరంగల్ వాయిస్, నడికూడ :** పరకాల నియోజకవర్గం నడికూడ మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలను మంగళవారం పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, తరగతి గదులు, వంట రూములను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి రాగి జావా తాగారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ ఆధ్వర్యంలో 2025 సంవత్సరం పిల్లల ఫొటోతో కూడిన క్యాలెండర్ ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలకు దీటుగా చర్లపల్లి పాఠశాల ఉందని, ఇక్కడి పరిసరాలు, వసతులు, చాలా బాగున్నాయని విద్యార్థులు చాలా చక్కగా ఉన్నారని, విద్యార్థుల ఫొటోతో కూడిన క్యాలెండర్ బాగుందని అభినందించారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పడిన గ్రామ సర్పంచ్ చాడ తిరుపతి రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ లను ఈ సందర్భంగా అభినందించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకుని 80 మంది విద్యార్థులకు గాను ఈరోజు హాజరైన విద్యార్థులు సంఖ్య 77 అని తెలుసుకుని విద్యార్థుల హాజరుపట్ల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ తీసుకుంటున్న చర్యలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



### సరస్వతీ మాత విగ్రహావిష్కరణ..

చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సరస్వతి మాత విగ్రహ ఆవిష్కరణ నిర్వహించారు. వాసవి క్లబ్ హనుమకొండ ఆధ్వర్యంలో పాఠశాలలో కేసీజీఎఫ్ జిల్లా గవర్నర్ గంప సాంబమూర్తి సరస్వతీ మాత విగ్రహావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ నెంబర్ మీడియాల నూతన్ కుమార్, పబ్బాతి నాగభూషణం, పాలడుగుల లక్ష్మణ్ కాంత్, అయిత వెంకటేశ్వర్లు, ఇరుకుల్ల శ్రీనివాస్, మాదంశెట్టి సంపత్, ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్, చర్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ చాడ తిరుపతిరెడ్డి, అంగన్వాడీ టీచర్స్ భీముడి లక్ష్మి, నందిపాటి సంధ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కందకట్ల రమ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

మంగళవారం, డిసెంబర్ 31, 2024

# కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలి

## ➲ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ సూచించారు. జిల్లాలోని బయ్యారం, గార్ల, డోర్నకల్ మండలంలోని పలు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేసి ధాన్యం వివరాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. ధాన్యానికి సంబంధించి వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేసి డబ్బులు త్వరగా పడే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మ్యాచర్ ఏ విధంగా ఉందని చెక్ చేశారు. సెంటర్‌కు కేటాయించిన రైస్ మిల్లులకు ఎప్పటికప్పుడు కొనుగోలు చేస్తూ రైస్ మిల్లులకు వేగవంతంగా త్వరితగతిన తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని, కొనుగోలు ధాన్యం వివరాల ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎమ్మార్వో కృష్ణవేణి, ఎంపీయం శంకర్, ఆర్ఐ యాసిన్, నందా తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వాటర్ స్టీల్ బాటిళ్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, నడికూడ :** ప్రాథమికోన్నత పాఠశాల పులిగిల్ల విద్యార్థుల కోసం మండగొండి శ్రీనివాస్ (ఎస్ బీఐ బ్యాంక్ మేనేజర్ ఎల్డీఎంఎస్ హనుమకొండ) దాదాపు పదివేల రూపాయల విలువైన స్టీల్ వాటర్ బాటిళ్లు అందించి వారి దాతృత్వాన్ని చాటుకున్నారు. ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ పిల్లల ఆరోగ్యానికి హానికరం కాబట్టి, చక్కని స్టీల్ బాటిల్స్ అందించి, వారికి పిల్లల పట్ల అమితమైన ప్రేమని వ్యక్తీకరించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలప్రధానోపాధ్యాయులు సంపత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు విద్యార్థులందరూ తప్పనిసరిగా రెండు లీటర్ల మంచినీరు తాగాలని, వాటర్ తాగడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులందరికీ ఇక నుంచి వాటర్ బెల్ ఉంటుందని, బెల్ అయిన తర్వాత వాటర్ తప్పనిసరిగా తాగాలని చెప్పారు. వాటర్ తాగడం వల్ల మనలోని వ్యర్థ పదార్థాలన్నీ బయటికి వెళ్లిపోతాయని, మనిషి ఆరోగ్యానికి మంచినీరు చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ చైర్ పర్సన్ పబ్బ సరిత, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు కటుకోజ్వల సతీష్, కవిత, ఆదిలక్ష్మి, రాజేష్, ప్రదీప్, అంగన్వాడీ టీచర్ రాజేశ్వరి, నిరోష, సూరమ్మ విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావడం జరిగింది. మంచి ఆలోచనతో వాటర్ బాటిల్స్ అందించిన మండగొండి శ్రీనివాస్ ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# చెక్ డ్యామ్ ను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నార్లపూర్ గ్రామంలోని పెద్దవాగుపై బ్రిడ్జి, చెక్ డ్యామ్, మత్తడి కాల్వను మంగళవారం పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. నార్లాపూర్ గ్రామం ముంపుకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కల్వర్టు ఇరువైపులా, మత్తడి పక్కన ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని, గ్రామం ముంపుకు గురి కాకుండా శాశ్వత ప్రాతిపదికన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజి రెడ్డి, పరకాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, నడికూడ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మల్హల్ రావు, కాంగ్రెస్ నాయకులు పర్నెం మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే హెచ్-143 నూతన కమిటీ ఎన్నిక



## ● అర్బన్ అధ్యక్షుడిగా హనుమాండ్ల రామకృష్ణారెడ్డి

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టీయూడబ్ల్యూజేహెచ్-143) మహబూబాబాద్ అర్బన్ నూతన కమిటీని సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈరగాని భిక్షం, జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య, కో కన్వీనర్ గాడి పల్లి శేఖర్ ఆధ్వర్యంలో సోమవారం ఐఎంఏ హాల్ లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీయూడబ్ల్యూజేహెచ్-143 అర్బన్ అధ్యక్షులుగా హనుమాండ్ల రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఇరుకుల్ల కిరణ్ కుమార్, రాసూరి లక్ష్మణ్, అంబటి వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా నల్లకుంట్ల కరుణాకర్, కోశాధికారిగా తప్పెట్ల రాజు, సహాయ కార్యదర్శిలు తోకల రామచంద్రు, బండ రాజ్ కుమార్, గుంటి శ్రీధర్, జంపాల చక్రధర్, కారుపోతుల రమేష్, గంధసిరి వెంకన్న, కమిటీ సభ్యులు మాలోతు సీతారాం, గుండోజ దేవేందర్, ఎండీ యాకుబ్, తేజావత్ శీను, ఆకుల నవీన్, బూర రంజిత్, మీడియా ఇంచార్జి తేజావత్ శ్రీనివాస్ లను ఎన్నుకున్నారు. ఎన్నిక అనంతరం హరిత మిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న నూతన కమిటీ సభ్యులందరికీ మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్లు పల్లె శ్రీనివాస్, పిడకల బాబురావు, ఎండీ గౌస్ పాషా, నాయకులు సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటో జర్నలిస్టులు మురళి, వెంకటేశ్వర్లు, రఘు పాల్గొన్నారు.

# బస్టాండ్, రైల్వే స్టేషన్ లో తనిఖీలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తున్న వేళ వరంగల్ కమిషనరేట్ పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఆదేశాల మేరకు యాంటీ డ్రగ్స్ టీం పోలీసులు, డాగ్ స్క్వాడ్, స్థానిక పోలీస్ అధికారుల కలిసి హనుమకొండ బస్టాండ్ తో పాటు, కాజీపేట రైల్వే స్టేషన్ లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో పోలీసులు అనుమానిత ప్రయాణికుల బ్యాగులను పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఆర్ఐ శివకేశవులు, కాజీపేట, హనుమకొండ ఇన్ స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి, సతీష్ తో పాటు యాంటీ డ్రగ్స్ బృందం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వరంగల్ కోటలో విద్యార్థుల సందడి



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** కాకతీయ సామ్రాజ్యమైన ఓరుగల్లును సందర్శించిన మాస్టర్ జి స్కూల్ విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు వారికి పర్యాటక శాఖ గైడ్ రవి యాదవ్ కళాఖండాల గూర్చి వివరించారు. పిల్లలంతా కేరింతలతో ఓరుగల్లు కోటలోని శిల్పా కళా ఖండాలను, స్వయంభు దేవాలయం కళా తోరణాలను చూసి, రాతి మట్టి కోటల అందాలను తిలకించారు.

# వైభవంగా అయ్యప్ప స్వామికి పూజలు



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక కూరగాయల మార్కెట్ వ్యాపారి మార్కెట్ మాజీ గౌరవ అధ్యక్షుడు వనం రాజేందర్-రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం పరకాల అయ్యప్ప స్వామి దేవాలయంలో అన్న వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు కానుగుల గోపీనాథ్, సంఘ పురుషోత్తం, చెట్ల రజనీకాంత్, వీర్ల విజయ్, కక్కు రాజు, కుక్కల శ్రీధర్, ఆకుల కుమారస్వామి, దేశపతి, 150 మంది అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో న్యూఇయర్ వేడుకలు జరుపుకోండి

## మట్టెవాడ సీఐ తుమ్మ గోపి



**వరంగల్ వాయిస్, మట్టెవాడ :** నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మట్టెవాడ సీఐ తుమ్మ గోపి సూచించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డిసెంబరు 31, జనవరి 1 రాత్రివేళల్లో మద్యం తాగి వాహనాలు నడిపినా, మైనర్ డ్రైవింగ్ చేసినా, రాత్రిపూట ఓవర్ స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్ చేసినా, కాగితాలు లేకుండా బండి నడిపినా, ట్రిపుల్ రైడింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందస్తుగా ఎలాంటి పర్మీషన్ లేకుండా డీజేలు పెట్టడం, రోడ్లపై కేక్ లు కట్ చేసి టపాసులు కాల్చడం, రోడ్డుపై మద్యం తాగి గొడవలు చేస్తే చట్టపరంగా వారిపై కేసులు నమోదుచేసి చర్య తీసుకుంటామని తెలిపారు. ప్రజలంతా తమ కుటుంబ సభ్యులతో క్షేమంగా కొత్త సంవత్సర వేడుకలు జరుపుకోవాలన్నారు. ప్రజల రక్షణ కోసం ప్రతీ జంక్షన్ లో పోలీసు నిఘా, బందోబస్తు ఉంటుందన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# లైసెన్స్ లేకుండా వాహనం నడపొద్దు

## వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ ముగ్గురు వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీ అబ్బోజు వెంకటేశం రూ.1300 జరిమాన విధించారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్ కేసులో 26 మందికి రూన.29,800 జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ రామకృష్ణ మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే చర్యలు తప్పవన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు.

# విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండలంలోని కస్తూర్బా గాంధీ సంక్షేమ పాఠశాల, కళాశాలను మంగళవారం ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు సందర్శించారు. విద్యాసంస్థలలోని సమస్యలపై విద్యార్థులతో మాట్లాడి వారితో కలిసి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో కస్తూర్బా పాఠశాలలు 400 పైచిలుకు ఉన్నాయని, దీనిలో సర్వ శిక్ష అభియాన్ ద్వారా ఉపాధ్యాయులు వీరికి పాఠాలు చెబుతున్నారు. వారు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల పరీక్షల సమయం దగ్గర పడుతున్న క్రమంలో ఇంకా పూర్తిగా సిలబస్ పూర్తవక విద్యార్థులు చదువు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 22 రోజులగా ఉపాధ్యాయులు సమ్మెను నిర్వహిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేకి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో కనీసం విద్యార్థుల పక్షాన మాట్లాడకుండా సినిమా హీరోల గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వెంటనే విద్యార్థుల సమస్యలను పరిష్కరించుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య సమితి సభ్యులు ఆరెపల్లి సుజిత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బానోత్ శ్రవణ్ కుమార్, కమలాపూర్ నగర కార్యదర్శి శివ, ఎస్ఎఫ్ డీ కో కన్వీనర్ రోహిత్, వెంగళ సాయికృష్ణ పాల్గొన్నారు

# అథ్లెటిక్స్ లో రాణిస్తున్న సంగీత

## గ్రామం నుంచి జాతీయ స్థాయికి
## ఆటాడిందంటే పతకం రావాల్సిందే
## స్పాన్సర్స్ కోసం ఎదురు చూపు



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ కుటుంబానికి చెందిన మౌటం శ్రీనివాస్– రమా దంపతుల ఒక్కగానొక్క కుమార్తె సంగీత ప్రస్తుతం స్థానిక మోడల్ స్కూల్ లో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చదువుతుంది. చిన్నతనం నుంచే ఆటపాటల్లో రాణిస్తున్న సంగీత గత కొద్ది సంవత్సరాలుగా అథ్లెటిక్స్ హామర్, డిస్క్ త్రో, జావలింత్రోలో రాణిస్తూ ఎన్నో పతకాలు సాధించింది. గతంలో జాతీయస్థాయిలోనూ రాణించిన ఈ క్రీడాకారిణి ప్రస్తుతం జరుగుతున్న ఎస్ జీఎఫ్ పోటీల్లో జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీల వరకు రాణించింది. రాష్ట్ర స్థాయిలో హామర్ విభాగంలో సెకండ్ ప్లేస్ లో, డిస్కస్ త్రో, జావలింగ్ త్రోలో మూడో ప్లేస్ లో నిలిచి పతకాలు పొందగా, జార్ఖండ్లో జనవరి మొదటి వారంలో జరగబోయే జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైంది. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తున్న యువతిని స్థానికులు అభినందిస్తుండగా, తల్లిదండ్రులు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నారు. స్పాన్సర్స్ ముందుకు వస్తే తమ బిడ్డ మరిన్ని పతకాలతో పాటు ఆథ్లెటిక్స్ లో మంచి పేరు సంపాదిస్తుందని తల్లిదండ్రెలు కోరుతున్నారు. యువ క్రీడాకారిని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనిత, మాజీ ఉప సర్పంచ్ రమేష్, ముదిరాజ్ కులస్తులు శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# బికూ నాయక్ విగ్రహావిష్కరణ

## హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని పెద్దమంగ్యా తండాకు చెందిన మాజీ ఎంపీటీసీ బికూ నాయక్ సంవత్సరీకం, విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారికి మంచి చేస్తే ఎప్పటికి ప్రజల మనసుల్లో నిలిచిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ట్రైకర్ చైర్మన్ రామచంద్రనాయక్, మాజీ జీసీసీ చైర్మన్ గాంధీ నాయక్ , సీనియర్ నాయకులు డాక్టర్ పొనుగంటి సోమేశ్వరరావు, తొర్రూరు మండల పార్టీ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు ,మాజీ జెడ్పిటిసి జిల్లా ఫ్లోర్ మంగళపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎనమనేని శ్రీనివాసరావు ,పట్టణ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్ రెడ్డి, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, కాలు నాయక్, ధరావత్ జైసింగ్ నాయక్, పాక్స్ డైరెక్టర్లు జనార్దన్ రాజు, బాలు నాయక్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎస్కే అంకూష్, రాయిశెట్టి వెంకన్న, జాటోత్ సురేష్, ధరావత్ అరుణ్, వెళికట్టే నాయకులు బత్తుల యాకయ్య, దేవేందర్ రావు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, దామోదర్ రావు, లింగారావు, పోసాని సంతోష్, బందు శ్రీను, దీకొండ ఎల్లయ్య, దీకొండ బాలకృష్ణ, దీకొండ రాంబాబు, దీకొండ సంతోష్, బందు రవీందర్, బందు శంకర్, బంధు యాకయ్య జాటో బోజ, జాటోత్ స్వామి, జాటోత్ యాకేష్, జాటోత్ లచిరాం, జాటోత్ బోండా, జాటోత్ దేవా, జాటోత్ తుకారాం, వంశీ, అనిల్, నాగరాజు, పెద్దమంగ్యా తండా పార్టీ ముఖ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ డాక్టర్ కుందూరు రాజేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా అన్నారం క్రాస్ రోడ్ వద్ద అన్న ప్రసాద వితరణ చేశారు. అనంతరం జడ్పీహెచ్ఎస్ వెల్లికట్ట పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందజేశారు. మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు టీచర్స్ ఆధ్వర్యంలో టీచర్స్ వెల్లికట్ట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో క్లబ్ అధ్యక్షులు చింతల సురేష్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన లయన్స్ క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ కుందూరు రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ అవసరార్థులకు, అన్నార్తులకు సేవ చేయడం అభినందనీయమని, విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థితిలో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చింతల సురేష్ మాట్లాడుతూ విద్యార్థులకు టీచర్స్ క్లబ్ సేవే మార్గం సేవే లక్ష్యంతో పనిచేస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతిలో ఉత్తమ ఫలితాల సాధన కోసం టీచర్స్ క్లబ్ విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ అందజేస్తుందని, విద్యార్థులు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ ను ఉపయోగించుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. వెలిదే సురేష్ కుమార్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఉత్తమ ఫలితాల సాధన కోసం విలువైన సలహాలు సూచనలు అందించి, విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు పాఠశాలకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.శ్రీను బాబు, టీచర్స్ క్లబ్ వారు తమ పాఠశాలకు మెటీరియల్ అందించడం పట్ల ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చింతల సురేష్, క్లబ్ ప్రధాన కార్యదర్శి వెలిదే సురేష్ కుమార్, క్లబ్ పూర్వ అధ్యక్షులు రాయపల్లి యాకయ్య, తోట రామయ్య, కాటం అనంతరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ పట్టణ గృహ నిర్మాణ తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు దుబ్యాల రాజయ్య అధ్యక్షతన నూతన సంవత్సర క్యాలెండర్ ను మంగళవారం ఘనంగా ఆవిష్కరించారు. దీంతో పాటు 2025 సంవత్సరానికి గాను పని, రేట్లు పుస్తకం కూడా విడుదల చేశారు. ఈ సమావేశంలో దుబ్యాల రాజయ్య, ప్రధాన కార్యదర్శి ముల్కల పల్లి ఐలయ్య, దామెర లింగయ్య మేస్త్రి, కోశాధికారి అనిశెట్టి రాంచందర్ మేస్త్రి, ఉపాధ్యక్షులు అందుగుల శీను మేస్త్రి, సుంకర బోయిన మల్లేశం మేస్త్రి, జంగం రవి మేస్త్రి, ఎనబోయిన వెంకన్న మేస్త్రి, మినుముల రాంరెడ్డి, సుతారి సదాశివుడు మేస్త్రి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# చెల్పూర్ మున్సిపాలిటీగా మారనుందా..?

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ ప్రత్యేక చొరవ
- త్వరలోనే నెరవేరనున్న చిరకాల స్వప్నం



**వరంగల్ వాయిస్, గణపురం :** మండలంలోని పారిశ్రామిక మేజర్ గ్రామపంచాయతీ చెల్పూరు త్వరలో మున్సిపాలిటీగా మారనుందని అధికార వర్గాల ద్వారా తెలుస్తుంది. గణపురం మండలంలోని బసవరాజు పల్లి(సింగరేణి గ్రామం), గొల్లపల్లి, భూపాలపల్లి మండలం కొంపల్లి, మొరంచపల్లి గ్రామాలను చెల్పూర్ లో కలిపి మున్సిపాలిటీగా చేస్తున్నట్లు చెబుతున్నారు. చిల్పూర్ మేజర్ గ్రామపంచాయతీలో ప్రస్తుతం కుందయ్యపల్లి, దుబ్బపల్లి, మాధవరావుపల్లి కాలనీ, కుందుర్పల్లి, వీరేపల్లి, పాపయ్యపల్లి తదితర గ్రామాలు ఉన్నాయి. అయితే మున్సిపాలిటీ వారు మున్సిపాలిటీకి ప్రస్తుతం చెల్పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాలు సరిపో నందున అదనంగా భూపాలపల్లి మండలంలోని కొన్ని గ్రామాలను కలుపుకొని వస్తున్నట్టు చెబుతున్నారు. కాగా, చిల్పూర్ లో కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టులు–2, పక్కన బసవరాజు పల్లిలో సింగరేణి గనులు అభివృద్ధి చెందుతూ గ్రామపంచాయతీ పరిధి దాటే పరిస్థితి ఏర్పడినందున ఇందుకు అనుగుణంగా అధికారులు నివేదికలు ఇచ్చినందున ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేకత తీసుకొని మున్సిపాలిటీగా మార్చడానికి అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం గణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చెల్పూరు ఉండగా మున్సిపాలిటీగా మారితే అక్కడ ప్రత్యేక వసతులు ఏర్పడతాయని చెబుతున్నారు. 15 ఏళ్ల క్రితమే చెల్పూరులో పోలీస్ స్టేషన్ ఏర్పాటు నిర్ణయం ఉండగా మున్సిపాలిటీతో అది తప్పనిసరిగా ఏర్పడే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. అయితే గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో చెల్పూరు మున్సిపాలిటీగా కావడం తథ్యమని తెలుస్తోంది.



# ఆమె మాయలో పడిపోవాల్సిందే..! :

'అలియాభట్ ఓ మాయ.. ఒక్కసారి ఆమెతో పనిచేస్తే ఆ మాయలో ఎవరైనా పడిపోవాల్సిందే. ఆమె ఆరా మనల్ని కూడా కమ్మేస్తుంది.' అంటున్నారు దర్శకుడు వాసన్‌బాల. ఇటీవలే అలియాతో ఆయన 'జిగ్రా' సినిమా తెరకెక్కించారు. ఫలితం ఆశించిన స్థాయిలో లేకపోయినా.. అలియాతో పనిచేశానన్న తృప్తి మాత్రం 'జిగ్రా' వల్ల లభించిందని ఆయన అన్నారు.' 'జిగ్రా' సీరియస్ సబ్జెక్ట్. ఆ కథలో కామెడీ లేదు. కానీ సెట్ అంతా ఎప్పుడు కామెడీగా ఉండేది. కారణం అలియాభట్. తను నవ్వుతూ అందర్నీ నవ్విస్తూ ఓ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని క్రియేట్ చేయడం అలియా స్పెషాలిటీ. ఆమెతో ఒక్కసారి పనిచేశాక.. మళ్లీ ఇంకొకరితో పనిచేయడం చాలా కష్టం. ఎందుకంటే తనే గుర్తుకొస్తుంటుంది..' అంటూ మాట్లాడారు వాసన్‌బాలా. దీనిబట్టి అలియా మాయ ఏ రేంజ్‌లో ఉంటుందో అర్థంచేసుకోవచ్చు.



## నెంబర్‌వన్ స్థానంలో నిలిచిన కల్కి 2898 ఏడీ చిత్రం

ప్రముఖ ఎంటర్‌టైన్మెంట్ పోర్టల్ ఇంటర్నెట్ మూవీ డేటా బేస్ ప్రతి సంవత్సరం దేశంలోని సినిమాల క్రేజ్ గురించి సర్వే నిర్వహించి.. మోస్ట్ పాపులర్ విభాగంలో టాప్ పొజిషన్‌లో ఉన్న సినిమాల జాబితాలను విడుదల చేస్తుందన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ఏడాది మోస్ట్ పాపులర్‌గా నిలిచిన సినిమాల జాబితాను ఐఎండీబీ విడుదల చేసింది. ఈ జాబితాలో ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ చిత్రం అగ్ర స్థానంలో ఉండగా.. బాలీవుడ్ బ్లాక్ బస్టర్ అందుకున్న 'స్త్రీ 2' రెండో స్థానంలో నిలిచింది. ఇక టాప్ టెన్‌లో ఉన్న సినిమాలు ఒకసారి చూసుకుంటే.! ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన బ్లాక్ బస్టర్ 'కల్కి 2898 ఏడీ. ది గ్రేట్ లెజెండ్స్ అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, హీరోయిన్ దీపిక పదుకొనే వంటి గొప్ప యాక్టర్స్ నటించిన ఈ చిత్రం జూన్ 27 న ప్రపంచవ్యాప్తంగా విడుదలై బ్లాక్ బస్టర్ అందుకొవడమే కాకుండా.. రూ.1300 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రం 2024 ఐఎండీబీ మోస్ట్ పాపులర్ సినిమా విభాగంలో టాప్ పోజిషన్‌లో నిలిచింది.

## ఆ స్థానంలో ఎవరు ఉన్న అలానే చేస్తారు

### బన్నీ అరెస్టును సమర్థించిన పవన్ కళ్యాణ్





పుష్ప 2 విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై తొలిసారి స్పందించారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. ఆయన మాట్లాడుతూ.. గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చారు. థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందిన అనంతరం ఆమె ఇంటికి వెళ్లి పరమర్శించాల్సింది. ఈ విషయంలో మానవతా దృక్పథం లోపించినట్లైంది. ఈ ఘటన జరిగిన తర్వాత అల్లు అర్జున్ సంతాపం తెలపకున్న.. చిత్రబృందం అయిన సంతాపం తెలపాల్సింది. సీఎం రేవంత్ రెడ్డి పేరు అల్లు అర్జున్ మర్చిపోవడంతో అతడిని అరెస్ట్ చేశారు అనడం సరికాదు. బన్నీ స్థానంలో రేవంత్ ఉన్న అలాగే అరెస్ట్ చేస్తారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని.. ఈ విషయాన్ని గుర్తు చేసుకోవాలంటూ పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు.

### అల్లు అర్జున్ బెయిల్‌పై 3కు వాయిదా

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో సినీనటుడు అల్లు అర్జున్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై నాంపల్లి కోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై అల్లు అర్జున్‌కి బెయిల్ ఇవ్వొద్దంటూ చిక్కడపల్లి పోలీసులు కౌంటర్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఈ రెండు పిటిషన్‌లపై నేడు విచారణ జరిగింది. అల్లు అర్జున్ తరఫు లాయర్‌లు బెయిల్ మంజూరు చేయాలంటూ తమ వాదనలు ధర్మాసనంకు వినిపించారు. అయితే ఇరు పక్షల వాదానలు విన్న నాంపల్లి కోర్టు.. తీర్పును జనవరి 3కు వాయిదా వేసింది. పుష్ప2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొకిసలాట ఘటనలో పోలీసులు ఇటీవల అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అయితే అదే రోజు హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. నాలుగు వారాలపాటు ఈ బెయిల్‌ను మంజూరుచేసిన కోర్టు రూ.50 వేల వ్యక్తిగత బాండ్లు చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌కు సమర్పించాలని ఆదేశించింది. మరోవైపు నాంపల్లి కోర్టు అతడికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. తాజాగా ఈ రిమాండ్ ముగియడంతో అదే రోజు ఆయన వర్చువల్‌గా కోర్టుకు హాజరయ్యారు. అప్పుడే అల్లు అర్జున్ తరఫు న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఈ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా పడిరది. అయితే నాంపల్లి కోర్టు నేడు విచారణ చేపట్టి.. తీర్పును జనవరి 03కి వాయిదా వేసింది.



## ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపిన నాగచైతన్య దంపతులు

ప్రధాని నరేంద్ర మోడీ మన్ కి బాత్‌లో భాగంగా.. దివంగత నటుడు అక్కినేని నాగేశ్వరరావుపై ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. మన్ కీ బాత్ 117వ ఎసిపోడ్‌లో అక్కినేని నాగేశ్వరరావు గురించి ప్రధాని మోడీ మాట్లాడుతూ.. అక్కినేని తన కృషితో తెలుగు సినిమాను శిఖరాగ్రాన నిలబెట్టారని ఆయన కొనియాడారు. భారతీయ సంస్కృతి, వారసత్వ విలువలు ఆయన సినిమాల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తాయని మోదీ మన్ కీ బాత్‌లో గుర్తుచేసుకున్నారు. ఏన్ఆర్‌పై మోదీ మాట్లాడటంతో తెలుగువారంతా ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఇదిలావుంటే.. మోడీ చేసిన వ్యాఖ్యలపై అక్కినేని నాగచైతన్య, శోభితా దుళిపాళ దంపతులు స్పందించారు. ప్రధాని మోడీకి కృతజ్ఞతలు చెబుతూ.. సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. అక్కినేని నాగేశ్వరరావు కళా నైపుణ్యాన్ని, తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని మీరు అభినందించడం ఎంతో ఆనందంగా ఉంది. మీ నుంచి ప్రశంసలు పొందడం మా అదృష్టం. మీకు హృదయపూర్వక ధన్యవాదాలు అంటూ నాగ చైతన్య, శోభిత రాసుకోచ్చారు.

## కొత్త ఏడాదిలో 'ఘాటీ' తో స్వీటీ

### వైవిధ్యభరితమైన పాత్రలో వస్తున్న అనుష్క

కెరీర్ బిగినింగ్‌లో గ్లామర్ పాత్రల్లో ఓ వెలుగు వెలిగింది అనుష్క. అయితే.. 'అరుంధతి' తర్వాత ఆమె నుంచి రెగ్యులర్ గ్లామర్ పాత్రలు కాకుండా, అభినయానికి ఆస్కారమున్న పాత్రల్నే ఆడియన్స్ ఆశించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఆమె చేసిన వేదం, బాహుబలి ఫ్రాంచైజీ, రుద్రమదేవి, సైజ్ జీరో, భాగమతి, నిశ్శబ్ధం, మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి సినిమాలు ఆమెను నటిగా గౌరవప్రదమైన స్థానంలో కూర్చోబెట్టాయి. ఆ వరుసలో ఆమె చేస్తున్న మరో వైవిధ్యమైన సినిమానే 'ఘాటీ'. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఉత్తరాంధ్ర గంజాయి తోటల నేపథ్యంలో సాగే విభిన్న కథాచిత్రమని తెలుస్తున్నది. ఇందులో అనుష్క పాత్ర ఊహలకు అతీతంగా ఉంటుందని సమాచారం. ఇటీవల విడుదలైన టీజర్‌లో.. అనుష్క బస్‌లో ఓ వ్యక్తిని మర్డర్ చేసే సన్నివేశం సినిమాపై అంచనాలు పెంచేసింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ 80 శాతం పూర్తయింది. ట్కక్లైమాక్స్ షూట్ మాత్రమే మిగిలివుంది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా నడుస్తున్నది. జనవరి చివరివారం నుంచి ట్కక్లైమాక్స్ షూట్ ఉంటుందని తెలుస్తున్నది. ఏప్రిల్ 18న చిత్రాన్ని విడుదల చేయనున్నారు. సాయిమాధవ్ బుర్రా ఈ సినిమాకు సంభాషణలు అందిస్తున్న విషయం తెలిసిందే.



# ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం

- రూ. 5.98 కోట్లతో కృష్ణ కాలనీ కళాశాలకు నూతన బిల్డింగ్
- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్
- మంత్రి కొండా సురేఖ చొరవతో సాకారం కానున్న విద్యార్థుల కల



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండా మురళీధర్ రావు ప్రత్యేక చొరవతో వరంగల్ జిల్లా స్టేషన్ రోడ్ లోని కృష్ణ కాలనీలో ఉవున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, హై స్కూల్ లకు త్వరలో నూతన బిల్డింగ్ కాంప్లెక్స్ రూపుదిద్దుకోనుంది. ఆగస్టులో కళాశాల, హై స్కూల్ ను తనిఖీ చేసిన కొండా మురళి సుమారు 70 సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఆ విద్యాలయాలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా పరిశీలించారు. గోడలు, తరగతి గదులు మన్నికను కోల్పోయి పెచ్చులూడి, వర్షపు నీటి నిల్వతో దుస్థితికి చేరుకున్న తీరును, విద్యార్థులు పడుతున్న బాధలను స్వయంగా తెలుసుకుని, పాత బిల్డింగ్ స్థానంలో నూతన బిల్డింగ్ నిర్మాణం చేపట్టి, విద్యార్థుల కష్టాలను తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈ దిశగా మంత్రి కొండా సురేఖ స్వయంగా దృష్టి సారించారు. ఇందుకు అవసరమైన నిధులను సీఎస్ఆర్ (కార్పోరేట్ సోషల్ రెస్పాన్స్ బిలిటీ) ద్వారా సమీకరించి, త్వరలో నూతన బిల్డింగ్ నిర్మాణ పనులను ప్రారంభించేందుకుగాను కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. జూనియర్ కాలేజీ నిర్మాణానికి రూ.4.5 కోట్లు, హై స్కూల్ నిర్మాణానికి రూ.1.48 కోట్లతో మొత్తం రూ.5.98 కోట్లతో నూతన భవన నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ మేరకు తెలంగాణ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ అంచనా ప్రణాళికలను సిద్ధం చేసింది. సీఎస్ఆర్ నిధులను సమీకరించిన వెంటనే నూతన బిల్డింగ్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

నూతన బిల్డింగ్ నిర్మాణ కార్యాచరణను వేగవంతం చేసినందుకుగాను ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ శరదృతి, హై స్కూల్ హెడ్ మాస్టర్ అశోక్ కుమార్ హైదరాబాద్ లోని సెక్రటేరియట్ లో మంత్రి కొండా సురేఖను వారి కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంతో పాటు, వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తూనే ఉంటామని మంత్రి సురేఖ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రానికి రెండో రాజధానిగా వరంగల్ ను అత్యద్భుతంగా తీర్చిదిద్దే దిశగా పట్టుబట్టి ఒక్కో అభివృద్ధి కార్యక్రమాన్ని చేపడుతూ, వరంగల్ ఖ్యాతి విశ్వవ్యాప్తం అయ్యేలా శ్రమిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

## రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

**- మంత్రి కొండా సురేఖ**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** లక్ష్య సాధనకు ప్రయత్న లోపం లేకుండా కృషి చేస్తూ, అస్తిత్వం ప్రసాదించిన ఈ జీవితాన్ని ఆనందంగా స్వీకరించడమే అర్థవంతమైన జీవితమని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని, అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని మంత్రి ఆకాంక్షించారు.



## 'ఎగ్జిబిషన్ ' ప్రారంభం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని బాలసముద్రం హయగ్రీవచారి గ్రౌండ్స్ లో ఏర్పాటు చేసిన 'ఎగ్జిబిషన్ ' ను మంగళవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర ప్రజలకు ఆటవిడుపుగా ఉండేందుకు ఎగ్జిబిషన్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. చిన్నా, పెద్దలందరినీ ఇది అలరిస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రేపటి తరానికి మీరే స్ఫూర్తిదాయకం



- సీపీ అంబర్ కిషోర్ ఝూ
- ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి ఘన సత్కారం

**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సుధీర్ఘకాలం విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీస్ అధికారులను సీపీ అంబర్ కిషోర్ ఝూ ఘనంగా సత్కరించారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందుతున్న ఎస్సైలు ఉమాకాంత్, ఐలయ్య , ఏఆర్ఎస్సై శ్రీనివాస్, కానిస్టేబుల్ పద్మారావులను పోలీస్ కమిషనర్ పూలమాలలతో ఘనంగా సత్కరించడంతో పాటు, వారికి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ తమ కుటుంబ క్షేమం కన్నా సమాజ క్షేమం మిన్న అని నిరంతరం విధులు నిర్వహించేది పోలీసులు మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమములో అదనపు డీసీపీలు రవి, సురేష్‌కుమార్, ఏసీపీ అనంతయ్య, ఆర్ఐలు సతీష్, స్పర్జన్‌రాజ్, శ్రీనివాస్, శ్రీధర్ ఆర్ఎస్ఐ శ్రవణ్ తో పాటు కుటుంబ సభ్యులు, వారి బంధుమిత్రులు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముందస్తు వేడుకలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కాశిబుగ్గలోని బిట్స్ అశ్మక ఉన్నత పాఠశాలలో ముందస్తు నూతన సంవత్సర వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి హాజరై ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం జనవరి 1న నూతన సంవత్సరంగా మొదలుపెడతారన్నారు. ఈ రోజున అందరూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకోవడంతోపాటు కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలోకి కొత్త సంతోషాలను తీసుకురావాలని ఈ రోజున అందరూ ఒక లక్ష్యాన్ని పెట్టుకొని దాన్ని సాధించడానికి ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయమైన దుస్తులు ధరించి చక్కని నృత్యాలతో అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ స్మైల్-11 విజయవంతం చేద్దాం



**వరంగల్ వాయిస్, క్రైం :** అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ స్మైల్-11 విజయవంతం చేద్దామని వరంగల్ పోలీస్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ ఎం.రవి అన్నారు. మంగళవారం సుబేదారిలోని అసంత భవన్ లో వరంగల్ పోలీస్ కమిషనరేట్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ సంయుక్తంగా ఆపరేషన్ స్మైల్-11 కార్యక్రమంలో భాగంగా జనగాం, వరంగల్, హనుమకొండ జిల్లాలలోని వివిధ శాఖల అధికారులు, ఎన్జీఓలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ ఇన్ స్పెక్టర్ పి.వెంకన్న అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా హాజరైన అడిషనల్ డీసీపీ ఎం.రవి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా తప్పిపోయిన బాలలు, బాల కార్మికులు, హింస గురైన బాలలు, వివిధ రకాల పిల్లలను చేరదీయడానికి ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముష్కరణ కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. దానిలో భాగంగానే ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని జనవరి ఒకటో తారీకు నుంచి జనవరి 31 వరకు వరంగల్, హనుమకొండ, జనగాం పోలీస్ కమిషనర్ పరిధిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితోపాటు వివిధ ప్రభుత్వ శాఖలు, ఎన్జీఓ సంస్థల ప్రతినిధులతో కలుపుకొని ఒక టీంగా ఏర్పడి 18 సంవత్సరాలలోపు పిల్లలను సంరక్షించడానికి 30 రోజుల కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా బాల కార్మికులు, తప్పిపోయిన పిల్లలు, హింస గురైన పిల్లలు భిక్షాటన చేస్తున్న పిల్లలు, అక్రమ రవాణా, అనే తదితర అంశాల పట్ల పనిచేస్తూ వారిని రెస్క్యూ చేసి సంబంధిత చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచి వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐడీ డీఎస్పీ జితేందర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖలు వారి విధులకు అనుగుణంగా సమన్వయంతో, పూర్తి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ కె.వసుధ, హనుమకొండ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ కె.దామోదర్, జనగాం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ ఉప్పలయ్య, వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాల బాలల సంరక్షణ అధికారులు శ్రీదేవి, ప్రవీణ్ కుమార్, రవికాంత్ తో పాటు ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్, చైల్డ్ అడ్వకేట్ ఫోరం చైర్మన్ ఫాదర్ కోసి, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్లు శ్వేతా, భాస్కర్ రవికుమార్, ఎస్సైలు, కానిస్టేబుల్స్, లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ అధికారులు, ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టర్, ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, మై చార్జెస్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ జన్ను క్రాంతి చేరంజీవో, కోఆర్డినేటర్ పి.శిరీష, ఆంటిమెంట్ ట్రాఫిక్ యూనిట్ సిబ్బంది శ్రీనివాస్, సోమియోద్దీన్, రామారావు, భాగ్యలక్ష్మి, సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ ఈ.సుదర్శన్, మేనేజర్ ఎం.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com